# పాతకేడీ

## కోకా శ్రీ సుధ

రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న ఖైదీలు ఎవ్వరూ తాతయ్యకు ఎంతవయస్సు వుంటుందో, ఏతేదీన జైలులోకి వచ్చాడో, చెప్పలేరు. అసలు అతనికే గుర్తు లేదు ఎప్పుడొచ్చిందీ. ఎంతకాలంనుంచో జైలులో వుంటున్నా అతను జైలు జీవితానికి అలవడలేదు. ఎప్పుడూ నేను వెళ్ళిపోతే జైలులోకి రాను అంటుండేవాడు. చాలా మొండిమనిషి. అతను యవ్వనంలో కండలు తిరిగిన వస్తాదు. గుబురుమీసం, మెడలో హనుమంతుడి తాయీదు. యవ్వనం అంతా పోలీసువాళ్ళ దెబ్బలకీ జైలుతిండికీ ఖర్చుపెట్టేశాడు. అతని ఆశలంతా అతని వూరు మీద, ఆ వూరులో తన ఇంటిమీద ఆ ఇంటి పక్కనవున్న లక్ష్మి మీద ఉంది.

జైలులోని రికార్డులు ప్రకారం తాతయ్య జులై 21, 1938 కి పద్నాలుగు సంవత్సరాలు కారాగారవాసం అనుభవించాడనీ, ఇంకా పదేండ్లుండాలని చూపెడుతున్నాయి.

అసలతనికి మొట్టమొదటి పది సంవత్సరాలు గ్రామంలో పరంధామయ్య అనే వ్యక్తిని హత్యచేసి తప్పించుకునిపారిపోయినందుకు, కావలాపోలీసులను కొట్టినందుకు, ఇతర అధికారులమీద తిరగబడినందుకూ, అతని శిక్షాపరిమితి పెరుగుతూనే వచ్చింది. పదేళ్ళల్లా పదకొండు, పదకొండుల్లా పన్నెండు, అలా పదిహేను సంవత్సరాలవరకూ పెరిగింది. ఆ తర్వాత అతను విడుదలయ్యాడు. మళ్ళీ పట్టుబడ్డాడు—సూట్‌కేస్ దొంగిలించినందుకు. పాతకేడీ గాబట్టి, నాలుగు సంవత్సరాలు వేశారు.

ఈసారి తిరిగివచ్చాక జైలులో అతనంటే అభిమానం, జాలి కల శివారెడ్డి జైలువార్డెన్ అయ్యాడు. ఒకరోజున ఆయనతో నా కేసు అయిపోవచ్చిందండీ! ఈసారి వస్తే రాను. మావూరు వెళ్ళి ఎంచక్కా మా లచ్చిని పెళ్ళిచేసుకుంటా. అన్నాడు. అలాగే విడుదల అయ్యాడు. వాళ్ళ వూరు వెడుతూండగా అతనికి సీతమ్మ అనే మనిషి కలిసింది. సీతమ్మ తాతయ్య ఏలూరులో ఆగిపోయారు. లక్ష్మి సంగతి మరచిపోయి సీతమ్మను పెళ్ళిచేసుకుందామనుకున్నాడు. కాని డబ్బు కావాలి. డబ్బుతెస్తేకాని సీతమ్మ తనముఖం చూడదు. వెళ్ళాడు డబ్బుకోసం. న్యాయంగా పని చేసి సంపాదిద్దామని. కాని అందరూ ఛీ కొట్టారు, అవమాన పరిచారు. తనను ఎరుగని ఏలూరు పక్కనున్న పల్లెటూరికి వెళ్ళాడు పనికోసం. మునసబు రంగయ్యగారింట్లో చేరాడు. ఆయన జమాబందిడబ్బు లెక్కపెడుతూంటే అతని ఆశలు చెలరేగాయి. లక్ష్మి చేయెత్తి పిలిచినట్లు అయింది అంతే ... ...మునసబు రంగయ్య కేకలు విని కరణం కోదండరామయ్యగారూ, వారి పెదబ్బాయి వెంకట్రావూ వచ్చి పట్టుకున్నారు. ఫలితం మళ్ళీ రాజమండ్రి సెంట్రలుజైలు నివాసం.

దేశానికి స్వాతంత్ర్యం లభించింది. అతనికీ విముక్తి దొరికింది. అతని జైలుజీవితం ఆఖరు రోజులలో అతని మనస్తత్వం మారిపోయింది. చిరకాలంగా అతని గుండెల్లో నిద్రపోతున్న పక్కింటి లక్ష్మి మేలుకుంది. అతనిఆశలతో వూసులాడుకునేవాడు. లక్ష్మి తనూ పెళ్ళిచేసుకున్నట్లూ, తన ముసలితల్లి తన బిడ్డల్ని ఆడిస్తున్నట్లూ కలలు కనేవాడు. అతనికల కలగానే వుండిపోతుందని అతనికి ఎవరూ చెప్పలేదు. ఒకవేళ చెప్పినా



నమ్మేవాడు కాదేమో. ఆగస్టు 15 ఉదయం అతనికి వీడ్కోలు యివ్వడానికి శ్రీహరి ప్రక్కనే వచ్చి నిలబడ్డాడు.

తాతయ్యా నేను రిటైరు అయిపోతున్నా. ఈసారి నీవు తిరిగివచ్చేటప్పటికి నే నుండను. ఒకవేళ నీవు తిరిగివస్తే నా స్థానంలో వచ్చిన వ్యక్తితో జాగ్రత్తగా వుండు అన్నాడు.

నేను తిరిగిరాను బాబయ్యా! తిన్నగా మా వూరు వెళ్తుండా. మా లచ్చి నాకోసం ఎదురు చూస్తూంటుంది. ఇంటికాడ్నే వుండిపోతా అన్నాడు తను రుద్ధకంఠంతో.

నీకోసం లక్ష్మి ఎదురు చూస్తుందని నమ్మక్కం వేనా? తాతయ్యా ఇంతకాలం నీకోసం ఎవరు చూస్తూందని ఎలా నమ్ముతావు అన్నాడు శ్రీహరి.

దానికి సమాధానంగా తాతయ్య మీకు తెలియదు లెండి నాకోసం లచ్చి పుట్టింది నాకోసం ఎదురు చూడకపోతే ఇంకెవరికోసం చూస్తుందండీ! అంటూ వెళ్ళిపోయాడు. అతని మూఢ నమ్మకానికి విస్మయపడుతూ, లోపలికి వెళ్ళాడు శ్రీహరి.

తాతయ్య మరుసటిరోజు తన వూరులో బస్సు దిగేసరికి సాయంత్రం అయింది అతను వూరిలో వచ్చిన మార్పునిచూచి ఆశ్చర్యపోయాడు. వూరంతా కొత్తఅల్లుడిలాసింగారించుకుని వుంది. ఏమూల చూచినా పెద్దపెద్ద కాఫీహోటళ్ళు, చిన్నచిన్న కిళ్ళీదుకాణాలు, పెద్దపెద్ద సినిమా హాళులూ, చిన్నచిన్న రిక్షాలు అంతా వింతగా వుంది అతనికి. తస్సదియ్యా ఇంతమందిజనం ఈవూరు ఎట్టావచ్చారబ్బా అనుకున్నాడు ఆ కాలంలో అతను రోజూ శివుడు గుడిలో లచ్చిని కలుసుకుంటూండేవాడు. ఆ గుడికి ఉత్తరంగా అరమైలు నడిస్తే తన యిల్లు. ఆ గుడికోసం వెతికాడు. ఆఖరికి కనపడింది. శిథిలమైపోతున్న శివుడి గుడి. వర్షం ప్రారంభమయింది. మెల్లిగా నడక ప్రారంభించాడు. చిమ్మ చీకటి. అరమైలు వెళ్ళేసరికి పెద్దగోడ అడ్డం వచ్చింది. తనయిల్లు వుండవలసిన చోటులో పెద్దగోడ కనబడేసరికి ఆశ్చర్యపోయాడు. చుట్టూ చూచాడు. ఎటు చూచినా మేడలు. తన యిల్లేది ? తన లచ్చేది ? అని అతనిలో ఆందోళన బయలుదేరింది. చెదిరిపోతున్న గుండెను చిక్కబట్టుకుని దూరంగా కనబడుతున్న దీపస్తంభం దగ్గరకు వెళ్ళాడు. ఒక్క గుడిసె కనబడింది. తలుపు తట్టాడు.

ఒక ముసలివాడు ఎవరు కావాలి? అని అడిగాడు

బాబూ! ఇక్కడ చానాఏళ్ళక్రితం రామమ్మ అనే ఆవిడుండాలి. కొడుకు జైలుకు వెళ్ళాడు కూడాను. ఆవిడ యిప్పుడు ఎక్కడ వుంటున్నదో తెలుసునా బాబూ! అన్నాడు.

ఆ— మతికొచ్చింది నాలుగేళ్ళక్రితం చచ్చిపోయిందయ్యా ఆయింటి ప్రక్కనున్న వాళ్ళమ్మాయి ఆ యిల్లు అమ్మేసి సమాధికూడా కట్టించింది అన్నాడు.

ఆ అమ్మాయి ఎక్కడుందిబాబూ! అని అడిగాడు ఆత్రుతగా.

అదిగో ఆ గోడ కవతలవున్న యింటిలో వున్నది తన మొగుడితో. ఇప్పుడావిడకు ఒక కొడుకు కూడాను. అన్నాడు.

దూరంగా పిడుగు పడింది. జీవితమంతా ఎవరి మీద నిర్మించుకున్నాడో, ఆ లచ్చి యింకొకరి సొత్తు అయిపోయింది. అతనిలో దాగివున్న ఆవేదనతోపాటు ముసలితనం బయటపడింది దారి ప్రక్కనున్నచెట్టుక్రింద కుప్పలా కూలిపోయాడు. నిరాశా, నిస్పృహా, నిస్సత్తువా అతనిని ఆవహించాయి. అలానే కటిక చీకటిలో ఆ వర్షంలో ఆ చెట్టుక్రింద సొమ్మసిల్లి పోయాడు పాతకేడీ తాతయ్య.

తెల్లవారింది అతను లేచాడు పరిస్థితులు తెచ్చిన మార్పుతో, పూరుకు అభిముఖంగా నడిచాడు. పోలీసుస్టేషనుకు వెళ్ళి బాబూ నేను పాతకేడీని. మళ్ళీ దొంగతనంచేస్తే మళ్ళీ రాజమండ్రీ సెంట్రల్‌జైలుకు పంపుతారా అని అడిగాడు అమాయకంగా.

పేరు ఆనంది తాతయ్యా డూ ! అని అడిగాడు ఇన్‌స్పెక్టరు అతను వేసిన ప్రశ్నకు సమాధానంగా. అవును అన్నాడు తాతయ్య.

నీకోసం ఎవరో వచ్చారు. కాస్సేపు అలా కూర్చో అ బల్లమీద కూర్చోబెట్టాడు ఆ ఇన్‌స్పెక్టరు.

నీకు యిల్లులేదా అని అడిగాడు యిన్‌స్పెక్టరు. నాకున్న ఇళ్ళు రెండేనండి ఒకటి ఈవూరులోది. రెండవది రాజమండ్రి సెంట్రలుజైలు. ఈవూరులోవున్న యిల్లు నాకు అందలేదు ఇంక నాకు మిగిలింది రాజమండ్రి సెంట్రల్ జైలుగదే. అంటూ ఏడ్చేశాడు.

వూరుకో తాతయ్యా అధైర్యపడవాకు అంటూ వచ్చాడు శ్రీహరి.

బాబూ మీరు యిక్కడకు ఎలా వచ్చారు ? అన్నాడు తాతయ్య.

నిన్ను తీసుకువెళదామని వచ్చాను అన్నాడు శ్రీహరి.

ఎక్కడికిబాబూ! రాజమండ్రికేనా పదండి బాబూ పదండి అంటూ లేచాడు తాతయ్య.

అక్కడికి కాదు తాతయ్యా. మా యింటికి. నీవు మాతోనే వుండిపోదువుగాని అన్నాడు శ్రీహరి అతని చెయ్యిపుచ్చుకుని.

కానీ నేను దొంగను బాబయ్యా! నా జీవితమంతా జైలులో గడిపినోణ్ణి పాతకేడీని అన్నాడు తాతయ్య.

అదంతా జరిగిపోయిన ఒక పీడకల అనుకో తాతయ్యా! నా సర్వీసు అంతా నీతోనే గడిచింది. నాకు నీకు మించిన ఆప్తులు లేరు. అన్నాడు శ్రీహరి రిటైర్డ్ వార్డెన్

పాతకేడీ కళ్ళలో నీళ్ళు తిరిగినాయి. ఏదో మాట్లాడుదామని ఏదో అడుగుదామని అనుకున్నాడు. కాని మాట గొంతుకలోనే ఇంకిపోయింది.

పద మళ్ళీ బస్సు అందదు అంటూ తీసుకు వెళ్ళిపోయాడు శ్రీహరి.

పాతకేడీ జీవితంలో కొత్తఅధ్యాయం ప్రారంభమయింది. అతని జైలు జీవితంలో అతనికి లభ్యంకాని ఆప్యాయత, ఆత్మీయత, ఆదరణ, అతనికి ఈనాడు లభ్యమైనాయి. పాతకేడీ జీవితం మారింది



— కె. వి. డి. మల్లికార్జునరావు